
కథ

# సంధ్య అంచున




ఆదూరి వెంకట సీతారామమూర్తి

తుళ్లిపడి లేచింది సుమతి. పాలమనిషి వచ్చి తలుపుగొళ్లెం చప్పుడు చేస్తోంది. గబగబా వెళ్లి తలుపు తెరచి పాలు తీసుకుంది. అప్పుడే తెల్లగా తెల్లారిపోయింది. పెరట్లో కెళ్లి ముఖం కడుక్కుని వచ్చి స్టౌవ్ అంటించి కాఫీనీళ్లు పడేసింది. నూతి దగ్గిరి కెళ్లి స్నానానికి నీళ్లు తోడింది. వస్తూ వస్తూ పెరటిగోడ మీంచి పక్కింటి వైపు చూసింది. కొత్తగా పెళ్లయిన జంట పెరట్లో నందివర్ధనం చెట్టు దగ్గర పూలుకోస్తూ సరసాలాడుకుంటున్నారు. చటుక్కున తల తిప్పేసుకుని గబగబా నడిచి వచ్చి చీపురు తీసుకుని ఇల్లు వూడ్చే పనిలో నిమగ్నమైంది.

'కొత్తగా పెళ్లయిన జంట నిత్యం అంత సంతోషంగా వుంటారా?' అన్పించిందామెకు. తనకీ అయింది పెళ్లి. ఒక అచ్చటా? ఒక ముచ్చటా? మూడుముళ్లూ పడ్డాయంతే. అదే పెళ్లనుకుంటే లోకం దృష్టిలో తనకీ పెళ్లయిపోయినట్టే!

గది వూడ్చేసి ముందు వసారాలో కొచ్చింది. తండ్రి పడుకొనే మంచం ఖాళీగా వుంది. సరిగ్గా అప్పుడే వీధిలోంచి నెమ్మదిగా కుంటుకుంటూ నడిచివస్తున్నాడు తిరుపతయ్య.

"ఎక్కడికెళ్లావు నాన్నా పొద్దున్నే" అడిగింది.

"ఇక్కడేనే. తోచక వీధిగుమ్మంలో నించుంటే వీరయ్య కన్పించేడు" అంటూ యింకా ఏదో చెబుతున్నాడు. వాకిలికూడా చిమ్మేసి లోపలి కెళ్లిపోయింది సుమతి. ముసలాయన నెమ్మదిగా కర్రసాయంతో లోపలి కొచ్చేడు. తను కాఫీ కలుపుకున్నాక గ్లాసులో పంచదార వేయని పాలు తెచ్చి అతని కందించింది సుమతి.

"సుమతీ! ఒకమాట"

"ఏమిటీ?"

"వీరయ్య యీమధ్య కొడుకు దగ్గరకి కాకినాడ వెళ్లేడట!"

"వెళ్లనీయండి. మీకా అదృష్టం ఎలానూ లేదు కదా!"

"అది కాదమ్మా. కాకినాడ్లో..." తిరుపతయ్య ఏదో చెప్పబోయాడు.

"ఉండండి. నేనింకా కాఫీ నీళ్లయినా గొంతులో పోసుకోలేదు. స్నానం చెయ్యాలి. వంట చెయ్యాలి. వన్లోకి పోవాలి. ఇవాళ లేవటమే ఆలస్యమైపోయింది" అంటూ వంటింట్లోకి వెళ్లి కాఫీ గ్లాసులో పోసుకుని రెండు గుక్కలు తాగి అలా గ్లాసుతోనే నడవలో కొచ్చింది.

పాలగ్లాసు అలాగే వుంది. తండ్రి ఎటో ఆలోచిస్తున్నాడు. అతన్ని చూస్తే జాలేసింది సుమతికి. అయినా తను ఆయన విషయంలో అశక్తురాలు.

"ఏమిటో చెప్పబోయారు. చెప్పండి" అంది.

తిరుపతయ్య ముఖం కాస్త ప్రసన్నంగా మారింది.

"కాకినాడ్లో మంచి డాక్టరున్నాడట. వీర్రాజు వియ్యంకుడికీ నాలాగే..."

"చాలు. ఇక చెప్పకండి. కాకినాడ వెళ్తానంటారా"

"వెళ్తే బాగుండు ననిపిస్తోంది. అతగాడిదీ నా వయసే. అతనికి కుదిరింది నాకెందుకు కుదరదూ?"

"కుదరకపోవచ్చు. వేళకి మందు వేసుకోడం, నియమాలూ, పథ్యాలూ పాటించడం మనకి చాతకాదుగా. అయినా ఎలా వెళ్తారూ? నాకు రావటానికి కుదరదు. ఈమారు సెలవంటే యింట్లోనే వుండి పొమ్మంటారు డాక్టరుగారు"

తిరుపతయ్య ఒక్క క్షణం ఏమీ మాట్లాడలేదు.

"పోనీ పక్కింటి చలపతిని అడిగిచూడనా" అన్నాడు కాస్సేపాగి.

"ఇప్పుడు ఆయన కూడా రాలేడు. పూర్వంలాకాదు. మాస్టర్లు ఏ వూరిబడిలో పనిచేస్తే ఆ వూళ్లోనే కాపురం ఉండాలట. అతనా వూరు వెళ్లే ప్రయత్నంలో ఉన్నాడు" అంటూ లోపలికెళ్లి కూరలబుట్ట ముందేసుకుంది. 'ఈయనకీ నానాటికీ చాదస్తం పెరిగిపోయింది. తనకు తోచిందే గాని ఒకరిమాట వినే అలవాటు లేదు' తనలో తానే విసుక్కుంది.

"వీరయ్యని రమ్మన్నా వస్తాడు. నేనంటే

గౌరవమున్న మనిషే. కాని చార్జీలు పెట్టి తీసుకెళ్లకపోతే బావుండదు" అంటూ తిరుపతయ్య అక్కడికే వచ్చాడు.

"చార్జీలూ, డాక్టరు ఫీజులూ, ఇతర ఖర్చులు ...ఎంత లేదన్నా వాలుగొందలవుతుంది. ఆలోచించేరా" అంటూ మరో మాటకు తావియ్యకుండా లేచి పెరట్లోకి వెళ్లిపోయింది సుమతి.

తిరుపతయ్య ఇక మాట్లాడ్డానికి ప్రయత్నించలేదు. లేచి వెళ్లి మంచంమీద కూర్చున్నాడు.

సుమతి స్నానం చేసి వచ్చి దేవుడు దగ్గర దీపం పెట్టి వంట కానిచ్చింది. అప్పటికి టైం ఎనిమిదిన్నర దాటింది. టిఫిన్‌బాక్స్ సర్దుకుని చీర మార్చుకుని యివతలి కొచ్చింది.

తిరుపతయ్య వీధిగడవలో గోడకానుకుని కూర్చుని వున్నాడు.

"వేన్నీళ్లు పెరట్లో గిన్నెతో పెట్టేను. చల్లారిపోతాయి. స్నానం చేసేయండి" అంది.

"అలాగే" అన్నాడు తిరుపతయ్య నెమ్మదిగా. కానీ లేవలేదు.

"నేను వెళ్తున్నాను. అన్నీ అక్కడే వున్నాయి. పదిన్నర దాటకుండా అన్నం పెట్టుకుని తినేయండి" అంది.

తిరుపతయ్య తలూపేడు గానీ మాట్లాడ లేదు. ఆయనెందుకు అలా వున్నాడో ఆమె గ్రహించింది. 'కాకినాడ వెళ్దురుగాని లెండి. డబ్బు నేనిచ్చి పంపుతా' అని వుంటే ఆయన ముఖం వికసించేది.

సుమతి వెళ్లిన పదినిమిషాలకు లేచి పెరట్లోకి వెళ్లేడు తిరుపతయ్య. నీళ్లు సగం చల్లారిపోయాయి. గావంచా కట్టుకుని ఆ నీళ్లే ఒంటి మీద దిమ్మరించుకుని స్నానం అయిం దనిపించి వచ్చి మంచం మీద కూర్చున్నాడు.

కళ్లు తిరుగుతున్నాయి. తలకూడ విసురుతోంది. అంతకుముందున్న బాధలు చాలవన్నట్లు ఈ మధ్య ఈ కొత్తరోగ మొకటీ! ఆయుర్వేద డాక్టరిచ్చిన పొట్లాం మందు వేసుకుని కళ్లు మూసుకుని కూర్చున్నాడు. ఎందుకో... ఈ మధ్య మార్కండేయులు గుర్తుకొస్తున్నాడు. నిస్సహాయత, అశక్తత కమ్ముకున్నపుడు అయినవాళ్లు గుర్తుకొస్తారు కాబోలు?

ఈ చివరి జీవితం మార్కండేయులు దగ్గర గడిచిపోతే ఎంత బాగుండేది? కానీ తనే చేతులారా చేసుకున్నాడు. ముప్ఫయ్ యేళ్లనాడు తులసి తనను వంటరి పక్షి చేసి పోయింది. అప్పటికి మార్కండేయులుకి మూడేళ్లు. మళ్లీ మరో స్త్రీ తన జీవితంలోకి రావడానికి కారకుడైన వెంకటరమణే మార్కండేయుల్ని తననుండి వేరుచేశాడా అన్పిస్తుంది. కానీ అది నిజం కాదు.

అయిదేళ్ల వసివయసులో వెంకటరమణకు పెంపకం వెళ్లిపోయేడు మార్కండేయులు. వెళ్తూ వెళ్తూ చూసిన ఆ చూపు తనకివ్వటికీ జ్ఞాపకమే. వెంకటరమణ దూరపుబంధువే. ఎక్కడైతేనేం పిల్లవాడు చక్కగా పెరగాలి అనుకున్నాడు తను ఆ సమయంలో. అందుకే ఒప్పుకున్నాడు.

ఇంటి ముందేదో రిక్షా ఆగి చప్పుడైతే లేచి చూశాడు తిరుపతయ్య. స్కూలు పిల్లల రిక్షా, ఎందుకో ఆగి, వెళ్లిపోయింది.

'మార్కండేయులు వస్తే బాగుండును' అనుకున్నాడు. నాలుగు రోజులుగా ఎందుకో కళ్లలో మెదుల్తున్నాడు.

అయిదారేళ్లుగా వెంకటరమణ యింట్లో మార్కండేయుల్ని చూసినపుడల్లా అన్పిస్తోంది. తనేం పోగొట్టుకున్నాడో, వెంకటరమణ తన వల్ల ఎంతటి అభిమానాన్నీ, ప్రేమనూ జీవితంలో పొందేడో!

రోడ్డుమీద పదిగంటల బస్సులు కాబోలు హారన్ మ్రోగించుకుంటూ వెళ్లిపోయింది. సుమతి మాట గుర్తొచ్చి భోజనానికి లేవబోయేడు. మోకాళ్లు రెండూ పట్టేసి కాలు సాగనివ్వలేదు. ఎడంకాలు మరీను. నెమ్మదిగా మోకాళ్ని చేతుల్తోనే రుద్ది స్వాధీనంలోకి తెచ్చుకున్నాడు. పెరటిపాదుకు కాసిన బీరకాయల కూర. ఇంగువచారు. మజ్జిగ. బతకడానికన్నట్లు తిండి...పత్యం తిండి!

భోజనం కానిచ్చి వచ్చి మంచంమీద కూర్చున్నాడు. తోచనివ్వని తల విసురు. నడవనివ్వని మోకాళ్ల సలుపులు. ఏడాదై పట్టి పీడిస్తున్నాయి. వీటికితోడు మాట్లాడేందుకైనా మనిషి దొరకని వంటరితనం.

సీతపోయిన తర్వాతే తనింట్లో యీ సమస్యలూ, రోగాలూ--

"పిల్లల్ని ఎలా పెంచాలో తెలియనపుడూ, వాళ్ల బాగోగులు సరిగా చూడలేనపుడూ వాళ్లని కనకూడదు. మనిషికి తిండొక్కటే కాదు, చాలా కావాలి. ఈ యింట్లో వున్నంతకాలం మనుషులు ఎదగరు. మనుషుల్లా బతకనూ లేరు" అంటూ వెళ్లిపోయి తనదారి తను చూసుకున్నాడు నరసింహం.

ఈ వయసులో చేతకానివానిగా ఆడపిల్ల సంపాదన మీద ఆధారపడి బతకాల్సి వస్తోంది!

ఏదో ఆలోచన చటుక్కున వచ్చి నెమ్మదిగా లేచి కూర్చున్నాడు తిరుపతయ్య. మంచం మీంచి లేచి చేతికర్ర తీసుకున్నాడు. తలుపు దగ్గరగా వేసి రోడ్డెక్కేడు. ఎండ చిటచిటలాడిస్తోంది. పది అడుగులు వేశాడో లేదో తూలి పడబోయి ఎలాగో నిభాయించుకున్నాడు.

"ఎక్కడికి తిరుపతయ్యా యీ టైమప్పుడు? ఆరోగ్యం కూడా సరిలేదు కదా" అని పలకరించేడు ముత్యాలు.

"ఈ వేళప్పుడైతే వీరయ్య యింట్లో వుంటాడనీ. అతనితో పనుంది" అన్నాడు. ఆయాసం వల్ల నోటంట మాటలు నెమ్మదిగా వచ్చేయి.

"బలేవోడివే. వీరయ్యెక్కడున్నాడు. కూతురి దగ్గర్నించి కబురొస్తే గంటక్రితమే బస్సులో వెళ్లేడు" అన్నాడతను.

ఉస్సూరుమనిపించింది తిరుపతయ్యకి. ఉన్న ఒక్క ఆశ కూడా జారిపోయింది.

"అవునూ మీ నరశింహం బడ్డీలో దొంగలు పడ్డారంటగా మా కామేశం చెప్పేడు. ఏపాటి నష్టం వుంటాది" అడిగేడు ముత్యాలు.

"ఏమో! తెలీదు. బంధాలు తెంపేసుకుపోయిన వాడి సంగతులు నాకెందుకూ? నాకా సంగతే తెలీదు" అన్నాడు తిరుపతయ్య.

"మాటామాటా వచ్చి ఒక దగ్గర లేకపోయినంత మాత్రాన తండ్రీ కొడుకులు కాకుండా పోతారా? నాలుగు డబ్బులు సంపాదించుకొస్తాడు చూస్తుండు" అంటూ ముందుకు సాగి పోయాడతడు.

ఎలా వచ్చేడో... వచ్చి మంచంమీద కూలబడ్డాడు తిరుపతయ్య. ఆ తర్వాత ఒళ్లు

## లిమ్కా బుక్‌లోకి ఎక్కిన అపూర్వ

పదవతరగతి చదువుకున్న అపూర్వ కర్ణాటకలో పుట్టి హైదరాబాదులో వుంటున్నది. బాల్యం నుంచే కవితలు రాస్తున్న అపూర్వను చాలా అవార్డులు వరించాయి. ఇంటర్నేషనల్ లైబ్రరీ ఆఫ్ పోయెట్స్ వారు అపూర్వను గత ఆగస్టులో అంతర్జాతీయకవిసమ్మేళనానికి ఆహ్వానించారు. ప్రతి రెండు నెలలకూ ఆలిండియా రేడియోలో ఆమె కవితలు ప్రసారమవుతుంటాయి. గత డిసెంబరులో ఢిల్లీలో జరిగిన నేషనల్ బాల్‌శ్రీ క్యాంప్‌కు హైదరాబాదు తరఫున హాజరైంది. అతిచిన్న వయసు గల కవయిత్రిగా లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్సులోకి ఎక్కింది అపూర్వ.

ఎన్.



తెలియని నిద్ర పట్టేసింది. లేచేసర్కి పెరటివైపునున్న కొండమీంచి సూర్యుడు దిగిపోతున్నాడు.

లేచి, ఆరుబయట నున్న బల్లమీద కూర్చున్నాడు. గాలి చల్లగా వీస్తూంది. మరో గంటలో సుమతి వచ్చింది. వస్తూనే కాళ్లు కడుక్కుని వంటింట్లోకెళ్లి కాఫీ కలుపుకుని తాగింది. తిరుపతయ్య కాఫీలూ టీలూ తాగడు. అతని ఆహారపుటలవాట్లే వేరు. కాస్సేపు స్థిమిత పడ్డాక బట్టలు మార్చుకుని వంటకుపక్రమించింది సుమతి.

కూతురితో ఏదో మాట్లాడాలని చూశాడు తిరుపతయ్య. కానీ కుదరలేదు. శరీరంలోని బాధ అతడిని ఒకచోట నిలవనీయటం లేదు. ఆ బాధని తగ్గించుకోవటం అతనివల్ల కావటం లేదు. నెమ్మదిగా లేచి వెళ్లి మంచంమీద పడుకున్నాడు. శరీరం ఏ స్థితిలో వున్నా బాధ మాత్రం ఒక్కలాగే తట్టుకోలేనట్లుగానే వుంది.

ఆర్నెల్ల క్రితం ఇలాగే బాధ భరించడం తన వల్లకాక పక్కింటి చలపతి చేత ఉత్తరం రాయిస్తే తను వచ్చి పట్నం తీసుకెళ్లి పెద్ద డాక్టర్లకి చూపించి పరీక్షలు చేయించి మందులు కొనిచ్చి మరీ వెళ్లేడు మార్కండేయులు.

కన్నకొడుకులా పెంచకపోయినా మార్కండేయులికి ఈ కన్నతండ్రంటే ప్రేమే.

తన శరీరతత్వానికా మందులు సరిపడలేదో. లేక మందులే పనిచేయలేదో కానీ బాధ తగ్గలేదు. ఆ సంగతే ఉత్తరం రాయిస్తే "నీ శరీరానికి మందులు పనిచేసే వయసు దాటిపోయిందట నాన్నా. డాక్టరు ఆ విషయం అప్పుడే చెప్పారు. నేను వచ్చినపుడు మరో ప్రయత్నం చేద్దాం. అంతవరకూ అవే వాడుతూండండి" అంటూ ఉత్తరం రాసేడు.

ఆడపిల్లయినా సుమతి కూడా తను పడుతున్న బాధ చూళ్లేక తన ప్రయత్నం తాను చేస్తూనే వుంది. నలుగురైదుగురు డాక్టర్లకి చూపించింది. కానీ ఫలితం శూన్యం!

తిరుపతయ్య పడుకునే ఆలోచిస్తున్నాడు.

"అన్నానికి రా నాన్నా" సుమతి పిలుపు వినిపించింది. తనికిష్టమైన ఆగాకరకాయ వేపుడు చేసింది. తన యిష్టాలేవో తెల్సు సుమతికి.

అయితే తనే సుమతి జీవితానికో మార్గాన్ని చూపలేకపోయాడు. పైగా దాని బతుకు బండలు కావడానికి కారకుడయ్యేడు. తమ పిల్లల జీవితాలకో దారి చూపించలేని వాళ్లు పిల్లల్నే కనకూడదట! నరశింహం యింటి నుండి వెళ్తూ అన్న మాటలింకా తన గుండెలో కలుక్కుమంటూనే వున్నాయి. నిజమేనేమో... తను పిల్లలకు సరైన దారి చూపించలేని అసమర్ధుడే!

భోజనం చేసి చేతికర్ర సాయంతో లేవబోయి జారి పక్కకి పడిపోయాడు. సుమతే లేపి కర్ర అందించింది. నెమ్మదిగా వీధి గడపలోకొచ్చి కూర్చున్నాడు. సుమతి గిన్నెలూ కంచలూ సర్దిపెట్టి వచ్చి పక్కలు దులిపింది. తండ్రి పడుకునే మంచం క్రింద మంచినీళ్ల చెంబు, గ్లాసు పెట్టింది. పెద్దలైటు తీసి చిన్నది వేసింది.

తిరుపతయ్య గుమ్మంలో అలాగే కూర్చున్నాడు. బయట గుడ్డివెన్నెల, గాలి ఆడటం లేదు. ఆకు కదలటం లేదు.

"పక్క దులిపేను. వచ్చి పడుకోండి తలుపేస్తాను" అంది. తిరుపతయ్య తలతిప్పి సుమతివంక చూశాడు కాని లేవలేదు.

"అమ్మా సుమతీ... మరీ..." అంటూ మళ్లీ ఏదో చెప్పబోయేడు.

"చూడండీ... ఇప్పుడు మీ బాధలన్నీ వినే ఓపిక నాకు లేదు. ఉదయం నుంచీ ఆస్పత్రిలో



గొడ్డులా పనిచేసి చచ్చిచచ్చి వచ్చాను. మళ్లీ యిక్కడ ఇంట్లో చాకిరీ. నన్ను 'ఎలా వున్నావ్, ఏం తిన్నావ్?' అని అడిగే మనిషి లేరు. ఒక ఓదార్పు గాని ఓ సాయం గాని లేని వెధవ బతుకైపోయిందని నేనేడుస్తుంటే నా ప్రాణానికి మీరొకరూ. కొడుకులకి అక్కర్లేకపోయింది. నేను ఏ జన్మలో ఏ పాపం చేశానో" అంటూ లోపలికివెళ్లి మంచంమీద వాలిపోయింది.

తిరుపతయ్య నిరుత్తరుడయ్యాడు.

నిజమే. అది ఏడుస్తోందంటే ఏడవదూ? దాని యీడువాళ్లు పెళ్లిళ్లు చేసుకుని పిల్లాపాపలతో సంసారాలు చేసుకుంటున్నారు. దీని రాతే యిలా తగలడింది.

'మంచి సంబంధం. పిల్లాడు బుద్ధిమంతుడు, చదువాట్టే లేకపోయినా పెళ్లాన్ని పోషించుకోగల సంపాదనుంది. తల్లీదండ్రీ లేరు. కట్నం అట్టే అడగడు' అని దూరపు బంధువొకాయ సంబంధం తెస్తే వివరాలు అట్టే తెల్సుకోకుండానే సుమతిని ఒప్పించి పెళ్లి చేసేసేడు. పెళ్లయిన మూణ్ణెల్లకి తెల్సింది. ఆ మతిస్థిరం లేని మారాజు రాత్రిళ్లు యింటికిరాడట. పగలు పన్లోకి వెళ్లడట. నెత్తీ నోరూ కొట్టుకొని 'ఛస్తే వాడితో కాపరం చేయనని వచ్చేసింది.'

ఎక్కువసేపు అలా కూర్చుని వున్నాడేమో తిరుపతయ్యకి మెడనరాలు లాగడం మొదలుపెట్టాయి. తలలో ఆలోచనలున్న కొద్దీ తల విసురుతూనేవుంది. ఈ బాధలకి ఎన్ని మందులు వాడేడో... ఎందరు డాక్టర్లని చూశాడో... డబ్బు ఖర్చయిపోయింది. రోగం మాత్రం పోలేదు. వయసు పెరిగిందీ అలోపతీ పనిచేయదంటే చాటుగా నాటువైద్యం కూడా చేయించుకున్నాడు. మెడనరాలమీదా, మోకాళ్ల మీదా తీగతో వాత లేయాలన్నా మొండిగా వేయించుకున్నాడు. తలకి ఎన్నో రకాల తైలాలు వాడేడు. రోగం పోలేదు సరికదా బాధ రెట్టింపయింది.

పిల్లలకి అందుకే తనమీద కోపం.

"ఈ రోగం పోయేదొక్కసారే.." అంటాడు నరసింహం. తండ్రనే అభిమానం లేకుండా.

మొండిగా మరో అరగంట మాత్రం కూర్చోగలిగేడు తిరుపతయ్య. పడుకోడం... పడుకోడం... పడుకోడం... ఎంతసేపలా పడుకుంటాడు? పడుకున్నా తల విసురుతూనే వుంటుంది. కళ్లు తిరుగుతూనే వుంటాయి.

'చచ్చిపోయినా బాగుండును' అనుకుని కన్నీళ్లు పెట్టుకున్నాడు చాలామార్లు. అయినా అది మాత్రం తన చేతిలో వుందా? ఇలా బాధతో ఎన్నాళ్లు అనుభవించాలని వుందో!

ఏమైనా ఇక ఈ బాధకేదో అంతం చూడాలి!

లేచి, తలుపులువేసి మంచంమీద పడుకుంటూ చూశాడు. గదిలో సుమతి పడుకుని వుంది.

రోగగ్రస్తమైన ముసలితనం ఎవరికీ వద్దు అది శాపం అనుకున్నాడు. ఆలోచనల్లో ఎప్పుడు పట్టిందో మాగన్ను... చటుక్కున మెలకువ వచ్చిచూశాడు. లోపలి గదిలోంచి గుడ్డిదీపవు వెలుగు కాస్తగా పడుతుంది. రెండోఆట సినిమా వదిలిన అలికిడి దూరంగా, కుక్కలేవో మొరుగుతున్నాయి.

నెమ్మదిగా కాళ్లు కూడదీసుకుని లేచి మంచినీళ్లు తాగేడు. పడుకుంటే అదే ఆలోచన. కాస్త ధైర్యం చెయ్యాలి. దాంతో అటో యిటో తేలిపోతుంది. ఒక నిర్ణయానికొచ్చి కళ్లు మూసుకున్నాడు. రెండుగంటలపాటు గాఢంగా నిద్రపట్టేసింది. ఈ మధ్యకాలంలో అంత మంచి

నిద్ర ఎరుగడు.

రోడ్డు నుంచి ఏదో బండి యీడ్చుకుంటూ నడుస్తోన్న చప్పుడు. తొలికోడి కూసేవేళ... లేచి కిటికీలోంచి చూసేడు. తూరుపు తెల్లబడుతోంది. కాస్సేపట్లో తొలి బస్సు ఉంటుంది. వంట్లో ధైర్యం, నోట్లో మాట యింకా వున్నాయి. దిండు గలీబులో గుడ్డకు చుట్టిన సొమ్ము వుండనే వుంది. శరీరంలో ఎక్కడలేని శక్తి వచ్చి తొరతొరగా బట్టలు మార్చుకున్నాడు. చేతిసంచి, చేతికర్ర, చెప్పులు సిద్ధం చేసుకున్నాడు. సుమతి గాఢంగా నిద్రపోతోంది. నెమ్మదిగా తలుపులు తీసి గుమ్మం దాటి ఆనవాలుగా అంచనాగా అడుగులు వేయడం మొదలుపెట్టేడు. నాలుగురోడ్ల జంక్షన్‌దాకా వెళ్తే అక్కడేదో బండి దొరక్కపోదు. సగందూరం వెళ్లేసర్కి తూరుపు తెల్లబడిపోయింది. మనుష్యసంచారమూ మొదలైంది. జంక్షన్‌లో ఒకే ఒక రిక్షా వుంది. రిక్షావాడు అందులోనే పడుకుని వున్నాడు. వాడిని రిక్షా కడతావా అనడిగేడు తిరుపతయ్య. వాడు లేచి ఎగాదిగా చూసి డబ్బులిచ్చేరకంలా లేదు అనుకుని మళ్లీ ముసుగుపెట్టేడు. ఈలోగా వెనకనించొచ్చిన మరో రిక్షావాడు ఆపేడు.

"బస్టాండుకి వెళ్లాలి వస్తావా" అన్నాడు తిరుపతయ్య.

"నాల్రూపాయలు"అన్నాడు వాడు. తిరుపతయ్య బేరం చేయలేదు. తిరుపతయ్య ఎక్కలేకపోతే వాడే చేయి సాయం ఇచ్చి ఎక్కించేడు.

బస్టాండులో దిగేస్కి ఆరుగంటలైంది. ఏవేవో వూళ్లలో బయల్దేరిన ఫస్టుబస్సులు కొన్ని వచ్చేయి.

అక్కడున్న బడ్డీ కొట్టువాడు కాఫీలు, టీలు జోరుగా అమ్ముతున్నాడు. కాస్సేపు అక్కడే నుంచుని అడుగు ముందుకు వేశాడు తిరుపతయ్య. అప్పుడే వచ్చిన బస్సులోంచి జనం తోసుకువస్తుంటే కాస్త పక్కకి జరిగి నుంచున్నాడు.

"ఏంటి నాన్నా, ఎక్కడికీ" మాట విన్పిస్తే తేరిపార చూసేడు. ఎదురుగా మార్కండేయులు.

తిరుపతయ్యకి నోటమాట రాలేదు. కళ్లంట నీళ్లు తిరిగేయి.

"సుమతి రాసిందా? బొత్తిగా బాగోలేదురా. బాధ భరించలేక చచ్చిపోయినా బాగుణ్ణనిపిస్తోంది" తిరుపతయ్య గొంతు బొంగురుబోయింది.

"అవేం మాటలు నాన్నా. రండి" అంటూ రిక్షా [illegible] తిరుపతయ్యని ఎక్కించి తనూ కూర్చున్నాడు.

"రెండు రోజులుగా కలలో మీరే. అందుకే బయల్దేరాను" మార్కండేయులు ఇంకా ఏదో చెబుతున్నాడు.

తిరుపతయ్య ఆలోచనలో పడ్డాడు. జైలునుంచి విడుదలై బయటకొచ్చే సమయానికి మరో కేసులో ఇరికించి మళ్లీ జైల్లోకి తోసినట్లనిపించిందాయనకి.

"కాకినాట్లో మంచి వైద్యుడున్నాడట... నీతో చెబుదామనీ..." తిరుపతయ్య నోట్లోంచి మాటలు నెమ్మదిగా వచ్చేయి.

మార్కండేయులు మాట్లాడదు. రిక్షా ఇంటి ముందు ఆగేసర్కి లోపల్నించి పరుగెత్తుకొచ్చింది సుమతి. తండ్రి చేతిలోని సంచి చూసేసర్కి ఆమెకంతా అర్థమైపోయింది.

తిరుపతయ్య తలొంచుకుని మౌనంగా లోపలికి నడిచేడు.

"చూశావా అన్నయ్యా! ఈయన చేష్టలు. నేనిలాక్కూడ బతక్కూడదు కాబోలు! నేను మందులు యిప్పించడం లేదనీ, నాకు యిష్టంలేదనీ నలుగురికీ తెలియాలనేగా ఆయన వంటరి ప్రయాణం?" సుమతి కళ్లలో నీళ్లు తిరిగాయి. ఆమె గొంతు బొంగురుబోయింది.

మార్కండేయులు చెల్లెల్ని సముదాయించే ప్రయత్నం చేసేడు.

"మనిషి సాయంలేందే అడుగుతీసి అడుగెయ్యలేని మనిషి. వంటరిగా యిలా... వళ్లు తూలో కళ్లు తిరిగో పడితే ఏమన్నా వుందా?" అంటూ కళ్లు తుడుచుకుని లోపలకి వెళ్లి అన్నగారికి గ్లాసుతో కాఫీ తెచ్చి యిచ్చింది.

కాఫీ తాగుతూ తండ్రికెదురుగా కూర్చున్నాడు మార్కండేయులు.

"చూడండి నాన్నా. విశ్వేశ్వరరావుగారనీ... ఎంత మొండి రోగాన్నయినా కుదర్చగల డాక్టరుగారు మావూళ్లో వున్నారు. ఆ సంగతి యీమధ్యే తెల్సింది. హోమియోపతీ వైద్యం చేస్తారు. మంచి హస్తవాసి అని పేరుంది. ఆయన్ని కల్సి మీ గురించి చెప్పాను. ఆయన మందిచ్చారు. క్రమం తప్పకుండా వాడితే నయమవచ్చన్నారు. నెల్లాళ్లకు మందిచ్చారు. మీరు వాడి గుణం కన్పించిందీ లేనిదీ చెబితే..." అంటూ జేబులోంచి ఓ చిన్నసీసా తీసి తండ్రికందిస్తూ... "పంచదార గుళికలు... పూటకైదు, రెండుపూట్లా వాడాలి" అన్నాడు. తిరుపతయ్య నిరుత్సాహంగానే అందుకున్నాడు.

"వాడదాం గానీ... ఒక్కమారు ఆ కాకినాడ డాక్టరుకి కూడా" అంటూ ఏదో అనబోయాడు. మార్కండేయులు తండ్రి పట్టు అర్థమైంది.

"ఆయన్నీ చూద్దాం. కావలిస్తే నేనొచ్చి తీసుకెళ్తా. ఈలోగా యిది వాడి చూడండి" అంటూ స్నానానికి పెరట్లోకి వెళ్లిపోయేడు మార్కండేయులు.

'కాకినాడ డాక్టరే పోగొట్టాలి... లేదా నరశింహా అన్నట్టు పుడకల్తోనే..." అంటూ ఏదో గొణుక్కుంటూ సలుపుతున్న మోకాళ్లకు ఆయుర్వేద లేహ్యం మర్దనా చేసేకుని మంచం ఎక్కేసేడు తిరుపతయ్య.

■



## ఎక్కువగా టీవీ చూస్తే హృదయరోగాలు?

నేటి పిల్లలు బయట ఆడుకోవటం, మిత్రులను కలవటం మానేసి ఎప్పుడూ టీవీ ముందే సెటిలైపోవటం అన్ని ఇళ్లోనూ వున్నదే. గంటల తరబడి, ఓ గంట కార్టూన్, మరి కాసేపు క్రికెట్, మరి కాసేపు మరో కార్యక్రమం-అట్లా టీవీకి అతుక్కుపోవటం దినచర్యలో భాగంగా మారిపోయింది కూడా. ఇందువల్ల పిల్లలకు హృదయరోగాలతో పాటు చాలా ముందే మరణం కూడా సంభవించవచ్చని బ్రిటన్‌లోని హార్ట్ ఫౌండేషన్ వారంటున్నారు. హాయిగా ఆడుకోవలసిన పిల్లలు అలా టీవీ కతుక్కుపోయి కూర్చోవటం వల్ల శారీరకవికాసం తగ్గిపోయి, స్థూలకాయం వస్తుంది. కనుక నాలుగు నుంచి పన్నెండేళ్ల పిల్లలు తప్పకుండా కనీసం రోజు కో గంట ఆడుకోవటం, సైక్లింగ్, పరుగెత్తడం, డాన్సు, వ్యాయామం చేయటం వంటి రకరకాల పనులు తప్పకుండా చేయాలంటున్నారా వైద్యనిపుణులు. దీని వల్ల పిల్లలు ఆరోగ్యంగా వుండటంతో పాటుగా రోజంతా ఉత్సాహంగానూ, తాజాగానూ వుండగలుగుతారు.

ఎస్.